


ఆన్‌లైన్ మోసం : రూ.5.80 లక్షలు స్వాహా

టి.నరసాపురం : ఆన్‌లైన్‌లో మోసగించి రూ.5.80 లక్షలు స్వాహా చేసిన సంఘటన మండలంలోని బొర్రంపాలెంలో వెలుగు చూసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొత్త ప్రద్యుమ్న సెల్‌ఫోన్‌కు తన ఆధార్ నెంబరుతో ముంబాయి నుంచి తైవాన్‌కు కొరియర్ బుక్ చేశావంటూ గుర్తు తెలియని ఫోన్ నెంబర్ నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. ఆ కొరియర్‌తో తన సంబంధం లేదని ప్రద్యుమ్న తెలిపినప్పటికీ తాము పోలీసులమని హర్యానా, గుర్గావ్, పాట్నాలలో కూడా నీకు ఖాతాలు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని, నీ ఖాతాలోని 93 శాతం నగదు బదిలీ చేస్తే 15 నిమిషాల్లో మళ్లీ మెసేజ్ పంపుతామని అటువైపు వ్యక్తి తెలిపారు. దీంతో ప్రద్యుమ్న తన ఖాతా నుంచి రూ.5.80 లక్షలను బదిలీ చేయగా అటువైపు నుంచి బదులు రాకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించాడు. ప్రద్యుమ్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూనిఫారం.. అందేదెప్పుడు..!

స్కూళ్లు తెరిచి నెల రోజులు గడుస్తున్నా అందని యూనిఫారం
రెండు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 2.35 లక్షల మంది
ఒక్కో విద్యార్థికి మూడు జతలు అందజేయాలని నిబంధన
ప్రభుత్వం వెంటనే ఇవ్వాలంటున్న తల్లిదండ్రులు
117 జిఒ రద్దుపై సర్వత్రా చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలు తెరిచి నెల రోజులు గడిచిపోయింది. విద్యార్థులకు ఇప్పటి వరకూ యూనిఫారం అందని పరిస్థితి నెలకొంది. దీంతో యూనిఫారం ఎప్పటికిస్తారో అని చర్చ తల్లిదండ్రుల్లో సాగుతోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లు 2,087 వరకూ ఉండగా లక్షా 36 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1,875 ప్రభుత్వ స్కూళ్లు ఉండగా 99 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. నిబంధనల ప్రకారం స్కూళ్లు తెరిచేనాటికి విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు వంటి వాటితోపాటు యూనిఫారం సైతం అందించాలి. ప్రతి విద్యార్థికి ఏడాదికి మూడు జతలు యూనిఫారం అందించాలనే నిబంధనలు సైతం ఉన్నాయి. ఏడాదిపాటు విద్యార్థులు ప్రతిరోజూ యూనిఫారం ధరించడంతో చినిగిపోవడం పరిపాటిగా జరుగుతోంది. స్కూళ్లు తెరిచేనాటికి యూనిఫారం క్లాత్ ఇస్తే వాటిని కుట్టించుకోవడానికి కొంత సమయం పడుతోంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. స్కూళ్లు తెరిచి నెల రోజులు దాటినా యూనిఫారం క్లాత్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు గతేడాది ఇచ్చిన యూనిఫారాన్నే వాడుతున్నారు. దీంతో కొంతమంది చినిగి దెబ్బతిన్న యూనిఫారం వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పుస్తకాలు, మిగిలిన వస్తువులు విద్యార్థులకు అత్యధిక శాతం ఇచ్చినప్పటికీ యూనిఫారం మాత్రం ఇప్పటి వరకూ విద్యార్థులకు చేరలేదు. విద్యార్థులకు యూనిఫారం ఎప్పటికిస్తారో సరైన స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు యూనిఫారం క్లాత్ అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదేక్రమంలో గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులకు సంబంధించి సైతం సందిగ్ధత నెలకొంది. రెండో విడత నాడు-నేడు పనుల్లో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో చాలా పాఠశాల్లో పనులన్నీ సగం సగం అన్నట్లు తయారయ్యాయి. వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే స్కూల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రభుత్వం దీనిపై వెంటనే తగునిర్ణయం తీసుకుని ముందుకు సాగాల్సి ఉంది. యూనిఫారం అందజేతపై ఏలూరు డిఇఒ అబ్రహంను వివరణ కోరగా ఇంకా అధోక్టుల్లే పెండింగ్ ఉందని, వారం రోజుల్లో యూనిఫారం సైతం అందజేస్తామని తెలిపారు.

117 జిఒ రద్దు చేస్తేనే నాణ్యమైన విద్య

గత ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమల్లోకి తెచ్చి విద్యావ్యవస్థను పూర్తిగా గాడితప్పేలా చేసింది. మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూల్లో విలీనం చేసింది. దీంతో ప్రాథమిక విద్య విద్యార్థులకు అందుబాటులో లేకుండాపోయింది. హైస్కూళ్లన్నీ దాదాపు గ్రామానికి దూరంగా ఉన్న పరిస్థితి ఉంది. మూడు, నాలుగు, ఐదు తరగతులు చదివే చిన్న పిల్లలను ప్రతిరోజూ అంతదూరం ఒంటరిగా పంపించేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో డ్రాప్‌అవుట్స్ పెరగడంతోపాటు ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. అంతేకాకుండా నూతన విద్యావిధానంలో భాగంగా ప్రభుత్వం తెచ్చిన 117 జిఒతో విద్యావ్యవస్థ అన్ని రకాలుగా దెబ్బతింది. గతంలో 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవారు. మార్పుల పేరుతో ఒకటి నుంచి ఎనిమిది తరగతుల వరకూ 52 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా చేశారు. తొమ్మిది, పది తరగతులకు 60 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా మార్చేశారు. ఇంగ్లీష్, తెలుగుమీడియంకు వేర్వేరు సెక్షన్లు లేకుండా ఒకటే సెక్షన్‌గా మార్పులు చేశారు. టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో 117 జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ జిఒ రద్దు చేస్తే ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతోంది. ఒకే ఉపాధ్యాయుడు ఉండే పాఠశాలలు తగ్గుతాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుంది. దీంతో జిఒ రద్దు ఎప్పుడనే చర్చ సర్వత్రా సాగుతోంది. ప్రభుత్వం వెంటనే 117 జిఒను రద్దు చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని అంతా కోరుతున్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

మెనూ ప్రకారం పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం అందించాలి
కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



గుడ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధనతోపాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉండాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వేలాది కోట్లు ఖర్చు చేస్తోందని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు ఉండాలని అన్నారు. విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం లేకుండా మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజూ పౌష్టికాహారంతో ప్రత్యేక మెనూను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నిర్దేశిత మెనూను ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కిచెన్‌ను పరిశీలించి వంట సరుకుల నాణ్యత, కోడిగుడ్ల పరిమాణం, చిక్కీల, భోజనం నాణ్యతను ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించారు. విద్యా కానుక కింద అందించిన బ్యాగ్‌లు, పాడ్స్, నోటు పుస్తకాలు అందాయా అని విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యా శాఖాధికారులు కూడా తరచూ తమ పరిధిలోని పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజనం నాణ్యత పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ అబ్రహం, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, తహశీల్దార్ మురార్జీ, ఎంఇఒ ఆర్.రంగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.సునీత పాల్గొన్నారు.

అనుమతి లేని విద్యాసంస్థలను మూయించండి

డిఇఒకు ఎస్ఎఫ్ఐ నేతల వినతి


డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో అనుమతి లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలను మూసివేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన డిఇఒకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ నగరంలో కొన్ని విద్యాసంస్థలు ఒక క్యాంపస్ పేరుపై అనుమతి తీసుకుని మిగిలిన క్యాంపస్‌ల్లోనూ విద్యాసంస్థలు నడుపుతున్నారని తెలిపారు. దానిలో మొదటిది నారాయణ, రెండోది అక్షర విద్యాసంస్థలు అని అన్నారు. ఆయా సంస్థల్లో బోధనా సిబ్బందికి అవసరమైన విద్యార్హత కూడా ఉండటం లేదని, వీటిపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జిల్లావ్యాప్తంగా మరికొన్ని విద్యాసంస్థలు వేరే విద్యాసంస్థల పేరుతో నడుపుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి ఈ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.రాకేష్, ఎల్.రాజేష్ పాల్గొన్నారు.

పామాయిల్ బోర్డు ఏర్పాటుకు కృషి

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పొగాకు, కొబ్బరికి బోర్డులు ఉన్నట్లే పామాయిల్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. స్థానిక శాంతినగర్‌లోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పామాయిల్ రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పామాయిల్‌కు బేసిక్ ధరగా క్వింటా రూ.17 వేలు నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుదామన్నారు. ఆ ధర నుండి ప్రతి సంవత్సరం మరింత ధర లభించేలా ప్రయత్నిస్తానన్నారు. మొదటిగా పోలవరం, తర్వాత పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కారమే తన అజెండాగా పెట్టుకున్నానని తెలిపారు. పామాయిల్ రైతులకు మేలు చేయడానికి ఎక్కడికైనా, ఎంతవరకైనా వస్తానన్నారు. రాష్ట్రంలో జలశక్తి ప్రాజెక్టులు తానే చూస్తున్నానని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి పామాయిల్ రైతులకు ధరకు సంబంధించిన ఇబ్బందుల్లేకుండా చేస్తానన్నారు.


ఎంపీకి వినతి అందిస్తున్న రైతు నేతలు, రైతులు

ఈసారి సమావేశం ప్రభుత్వాధికారులతో కలిపి నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పామాయిల్ రైతుల రాష్ట్ర అధ్యక్షులు బొబ్బర వీరరాఘవరావు, జాతీయ కార్యదర్శి క్రాంతికుమార్‌రెడ్డి, పెదవేగి ఆయిల్‌ఫెడ్ అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, నవభారత్ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ, గోద్రేజ్ అధ్యక్షులు చింతమనేని హనుమంతరావు, పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

వరి వంగడాల ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయిస్తా

వరి రైతులకు ఉపయోగార్థం వరి వంగడాల ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ పెట్టిస్తానని ఎంపీ మహేష్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన వరి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాజమండ్రిలో అతిపెద్ద వరి వంగడాల ప్రాసెసింగ్ పరిశ్రమ నిర్మిస్తున్నారని, ప్రతిరోజూ మూడు వేల టన్నుల నుండి 3,500 టన్నుల వరకూ ధాన్యం అవసరమవుతుందని అన్నారు. ఆ ఫ్యాక్టరీ వారు రైతులకు వడ్డీలేని రుణాలిస్తారని, తడిసిన ధాన్యాన్ని కూడా వారే కొంటారని తెలిపారు. వరి రైతులకు ఎటువంటి సమస్యలొచ్చినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనే అంశంపై మిల్లర్లతో చర్చిస్తానని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా తగ్గించి ఇచ్చిన సొమ్మును తిరిగి ఇప్పించడానికి ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, రైతు నాయకులు వందనపు సాయిబాబు, గూడపాటి శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, ముళ్లపూడి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో భారీ వర్షం


ముదినేపల్లిలో గుంతల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి, పరిసర గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకుపైగా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో జోరు వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని వడాలి-చిగురుకోట రోడ్డు, గుడ్లవల్లేరు రోడ్లపై ఉన్న భారీ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు గంటల పాటు కురిసిన వర్షం విత్తనాలను వెదజల్లిన చేలకు ఉపయోగకరమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ రైతులు చేల్లో నేరుగా విత్తనాలను వెదజల్లారు. వరుణుడు రాక కోసం ఎదురుచూస్తున్న ఈ తరుణంలో మండలంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో ఖరీఫ్ సాగు పనులు మరింత ముమ్మరంగా సాగనున్నాయి.


గట్టు దాటి ప్రవహిస్తున్న నీరు

కోతకు గురైన ఏలూరు కాలువ గట్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఏలూరు ప్రధాన కాలువలో నీరు గట్లను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ఉంగుటూరు-నారాయణపురం మధ్యలో అండర్ టన్నెల్-4 వద్ద గట్టు కొంత మేర కోతకు గురైంది. దీంతో అండర్ టన్నెల్ కల్వర్టు సిమెంటు గోడ పక్కనుంచి నీరు కొల్లేరులోకి ప్రవహిస్తోంది. కోతకు గురైన ప్రాంతంలో ఇసుక, కంకర బస్తాలతో గండిని పూడ్చాలని లేదంటే గట్టు మరింత బలహీనపడి పల్లపు భూములు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండి పడటం కాదని, కాలువలో నీటి ప్రవాహం ఎక్కువ కారణంగా ఓవర్ ఫ్లో అవుతోందని, ఇసుక బస్తాలు వేయించేందుకు చర్యలు తీసుకున్నామని, లస్కర్‌ను కాపలా ఉంచామని ఇరిగేషన్ ఎఇ పెద్దిరాజు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి నాగరంజిత్
ఎస్‌విఆర్‌కె కళాశాలలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నరసింహరావుపేటలోని ఎస్‌విఆర్‌కె కళాశాలలో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ వల్ల జరిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ట్రైనీ జడ్జిలు ఎం.రాజరాజేశ్వరి తేజస్విని, పివిఎస్ఎన్.లక్ష్మీలావణ్య, పివి.నాగరంజిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి నాగ రంజిత్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలన్నారు. మాదకద్రవ్యాల ఉపయోగించడం వల్ల ఆరోగ్య సమస్యలే కాకుండా వారి భవిష్యత్తు పైన తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. ఒకసారి అలవాటు పడిన వ్యక్తి మళ్లీ మామూలు వ్యక్తిగా మారటానికి చాలా శ్రమించాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో చదువు పట్ల శ్రద్ధ చూపించాలని సూచించారు. మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల కుటుంబ పరంగా, సామాజిక పరంగా ఎంతో నష్టం కలుగుతుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి పివిఎస్ఎన్.లక్ష్మీలావణ్య మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, ర్యాగింగ్ స్నేహాన్ని అభివృద్ధి చేసుకునేలా ఉండాలని, తోటి విద్యార్థుల మనోభావాలు దెబ్బ తినకుండా నడుచుకోవాలని సూచించారు. ర్యాగింగ్ వంటి సమస్యలు ఎదురైనప్పుడు విద్యార్థులు ఉపాధ్యాయులతో కాని, తల్లిదండ్రులతో కాని తెలియపరచాలన్నారు. సమస్యను దాచుకోవడం వల్ల మానసికంగా కుంగిపోవాల్సి వస్తుందని, దీని ప్రభావం చదువుపై పడుతుందని చెప్పారు. ఒకసారి ర్యాగింగ్‌కు పాల్పడిన వ్యక్తిని కళాశాల నుంచి తొలగించడమే కాకుండా చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మురళి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగరంజిత్

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో నీటిమట్టం గత రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్ వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో స్పిల్ వేలో సాధారణ నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.970 మీటర్లు, స్పిల్ వే దిగువన 17.060 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.050 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకి దిగువన 16.080 మీటర్లు నమోదైనట్లు ఇఇలు టి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.


పోలవరం వద్ద గోదావరి

పట్టిసీమ నుంచి 7.080 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7.080 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.387 మీటర్లకు చేరుకుందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 పంపులు 20 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకూ 4.015 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

పర్యావరణానికి హాని కలిగిస్తే ఉపేక్షించం

నాణ్యమైన మేతతో ఆక్వా కాలుష్య నివారణ
ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
పర్యావరణ పరిరక్షణపై నియోజకవర్గ స్థాయి సమీక్షలో ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సంప్రదాయ రీతిలో చేపల సాగుతో పర్యావరణానికి హాని జరగదని, నాణ్యమైన చేపల మేతతో ఎలాంటి నష్టం లేదని, ఫంగస్, రూప్‌చంద్ చేపల సాగులో మేతగా కోళ్ల వ్యర్థాల వాడకమే పర్యావరణానికి కాలుష్య కారకంగా మారిందని, దీనిని అరికట్టేందుకు గ్రామ గ్రామాన టాస్క్‌ఫోర్స్ కమిటీలను వేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణ (ఎకో పొల్యూషన్) కోసం చేపట్టాల్సిన చర్యలపై నియోజకవర్గ స్థాయిలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులతో నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వం పర్యావవరణం గురించి పట్టించుకోలేదన్నారు. రహదారులు, ఇరిగేషన్, డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు తావు లేకుండా పర్యావరణానికి, సాగు, తాగునీటిని కలుషితం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ధర్మరాజు ఆదేశించారు. డిపిఒ మాట్లాడుతూ పర్యావరణంపై సరైన అవగాహన లేక పట్టించుకోకపోవడం, సమన్వయలోపం, ప్రజల భాగస్వామ్య లేమి స్పష్టంగా కనిపించిందన్నారు. కలుషిత నీటితో డయేరియా ప్రబలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ఏం చేయాలో సూచనలు, సలహాలు ఇస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. నిడమర్రు మండల ఎఫ్‌డిఒ(ఫిషరీస్) మాట్లాడుతూ లక్షలాది ఎకరాల్లో చేపల సాగులో ఉన్నవాటిలో దాదాపు 45 వేల ఎకరాల్లో ఫంగస్ చేపలు పెంపకం ఉంటోందని, దానివల్ల కోళ్ల వ్యర్థాలు పెద్ద మొత్తంలో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతోందన్నారు. టాస్క్‌ఫోర్స్ మీటింగులు పెట్టి దాడులు చేసి మూడు కేసులు నమోదు చేశామన్నారు. కోళ్ల వ్యర్థాలు వచ్చే దారిలో అన్ని శాఖల బృందంతో చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేసి వాటి రవాణాను అరికట్టవచ్చనే అభిప్రాయాన్ని వెలబుచ్చారు. అటవీ శాఖాధికారి మాట్లాడుతూ కొల్లేరులో మంచి నీరు వచ్చే బుడమేరు, రామిలేరు తదితర వాగులు ఎప్పుడో కలుషితమయ్యాయని, వాటిని ప్రక్షాళన చేస్తే కాని కాలుష్యాన్ని నియంత్రించలేమన్నారు. గణపవరం ఎస్ఐ మాట్లాడుతూ గుండుగొలను వద్ద కాపలా ఉంచి కోళ్ల వ్యర్థాల వాహనాలు రాకుండా అరికట్టవచ్చన్నారు. ఇరిగేషన్ ఎఇ మాట్లాడుతూ పంట కాలువల్లోకి గ్రామాల్లోని చెత్తను పంచాయతీ వాళ్లే వదిలేయడంతో కలుషితమవుతున్నాయన్నారు. అంతే కాకుండా స్థానిక మురుగునీటి బోదెలన్నీ పంట కాలువల్లోకే విడిచిపెడుతున్నారన్నారు. నిడమర్రు ఇఒపిఆర్‌డి చంద్రశేఖర్ మాట్లాడుతూ నిడమర్రు మండలంలో పంచాయతీ తాగునీటిని తాగే పరిస్థితి లేదన్నారు. మంచినీటి బోదెల్లో ఆక్వా వ్యర్థాలు పూర్తిగా కలిసిపోయాయని చెప్పారు. అందరూ ఆర్ఒ ప్లాంటుల నుంచి నీటిని కొనుక్కుంటున్నారన్నారు. సిటిజన్ ఫోర్మ్ ప్రతినిధి చక్రవర్తి మాట్లాడుతూ కలుషిత నీరు, వాతావరణం వల్ల కేన్సర్ రోగాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ పాతూరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ కెఎఫ్‌సి తదితర ప్రముఖ చికెన్ సంస్థలు కేవలం లెగ్ పీస్‌లను తీసుకుని మిగతా కోడి మాంసాన్ని కోల్‌కత్తా, బెంగుళూరు తదితర ప్రాంతాల వారు కొనుగోలు చేసి వాటిని మన రాష్ట్రానికి చేపల మేతగా అమ్మేస్తున్నారన్నారు. రైతు రామరాజు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. నాలుగు మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఏర్పాటుకు కృషి చేసిన ఉంగుటూరు ఎంపిడిఒ శర్మను డిపిఒ, ఎంఎల్ఎ అభినందించారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ధర్మరాజు

జీతాలు విడుదల చేయాలని నిరసన

చాట్రాయి : తమకు రెండు నెలల జీతాలు విడుదల చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు కోరారు. ఈ మేరకు చాట్రాయి ఎంఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపి ఎంఇఒ ఎస్‌విఎస్.బ్రహ్మాచారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 483 మంది, రాష్ట్రంలో 25,683 మంది పని చేస్తున్నారన్నారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని, వారికి వెంటనే జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులు ముల్లంగి రామారావు, కృష్ణ పాల్గొన్నారు.

గ్రామసభను బహిష్కరించిన రైతులు

కొయ్యలగూడెం: మండలంలోని గవరవరం-1 రైతు భరోసా సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన గ్రామసభను రైతులు బహిష్కరించారు. పశుగ్రాసం పెంపకం కోసం ఉపాధి హామీ చట్టంలో అందించే రాయితీల నిమిత్తం అర్హులైన రైతులను గుర్తించేందుకు రైతు భరోసా సేవా కేంద్రం వద్ద గ్రామ సభ ఏర్పాటు చేసినట్లు పశు వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. అయితే ఉపాధి హామీ చట్టం కింద రైతులకు అందే రాయితీల గురించి వివరించడానికి అధికారులు, సిబ్బంది ఎవరూ హాజరవ్వకపోవడంతో రైతులు ఆగ్రహించి సభను బహిష్కరించారు. గ్రామసభను ఇంత నిర్లక్ష్యంగా నిర్వహించడం ఇది మొదటిసారి కాదని, చాలాసార్లు ఈ సందర్భం వచ్చిందని రైతులు వాపోయారు. పశు వైద్యాధికారిని దీనిపై వివరణ అడగగా ఇదే విషయంపై ఉపాధి హామీ చట్టం ఎపిఒను సంప్రదించగా వారు ఫోన్ కాల్‌కి అందుబాటులో లేరని తెలిపారు.


గ్రామసభను బహిష్కరించిన రైతులు

వ్యక్తిగత ఆదాయంగా కుళాయిలు..!

ఉచితంగా ఇచ్చేందుకు ఇష్టపడని పంచాయతీ - ప్రజల ఎదురుచూపు


కనెక్షన్ లేకుండా వదిలేసిన నాలుగు అంగుళాల పైపు

ప్రజాశక్తి - మండవల్లి

వ్యక్తిగత కుళాయిలు పంచాయతీ పాలకులకు, అధికారులకు ఆర్థిక వనరుగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా కుళాయి కనెక్షన్ ఇచ్చేసి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ సంపాదనకు గండి పడుతుందని జల జీవన్ మిషన్ ద్వారా ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పంచాయతీ చొరవ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జలజీవన్ మిషన్ కింద మూడేళ్ల క్రితం నిధులు మంజూరైనా నేటికీ ఉచితంగా ఒక్క కుళాయి కనెక్షన్ ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్వచ్ఛమైన తాగునీరందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2020లో జల జీవన మిషన్ పథకంలో మండవల్లిని ఎంపిక చేసి సుమారు రూ.85 లక్షల నిధులు మూడేళ్ల క్రితమే మంజూరు చేసింది. గుట్టు చప్పుడు కాకుండా కుళాయి కనెక్షన్లు ఇచ్చేసి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న పంచాయతీ పాలకులకు, అధికారులకు ఈ పథకం నచ్చలేదు. ఉచితంగా కులాయి కనెక్షన్ ఇస్తే వ్యక్తిగత ఆదాయం కోల్పోతామోనని ఉద్దేశంతో జలజీవన్ మిషన్ పథకాన్ని గ్రామస్తులకు తెలియనీకుండా మూడేళ్లుగోప్యంగా ఉంచారు. అంతేకాకుండా జలజీవన్ మిషన్ పనులు నిర్వహించేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చినప్పటికీ పనులు నిర్వహించకుండా అడ్డుకున్నట్లు సమాచారం. ఉచితంగా కుళాయిలను అందించాల్సి ఉండగా ఎస్‌సిల నుంచి రూ.ఐదు వేలు, బిసి, ఒసిల నుంచి రూ.7500 వసూలు చేయడానికి పాలకులు, అధికారులు సిద్ధపడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు. వ్యక్తిగత ఆదాయం కోల్పోతామని జలజీవన్ మిషన్ ద్వారా ఉచితంగా పంపులు ఇచ్చేందుకు ఇష్టపడలేదని తెలుస్తుంది. గ్రామస్తులు జనవరిలో నిర్వహించిన గ్రామసభలో అధికారుల గుట్టు రట్టు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ఇచ్చేసిన కుళాయి కనెక్షన్లపై నిలదీశారు. చుట్టుపక్కల గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఉచితంగా కుళాయి ఇస్తుంటే మండవల్లిలో డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తూ గ్రామసభను అడ్డుకున్నారు. గ్రామస్తులు ఎదురు తిరగడంతో పంచాయతీ పాలకులు చేసేదిలేక సార్వత్రిక ఎన్నికల ముందు తూతూ మంత్రంగా పనులు ప్రారంభించి కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారని స్థానికులు వివరిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి జలజీవన్ మిషన్ పనులను సమగ్రంగా పరిశీలించి నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న పాలకులు, అధికారులపై తగిన చర్యలు తీసుకొని కుళాయిలు ఇప్పించి తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కృష్ణారావును వివరణ కోరగా మూడేళ్ల క్రితమే జల జీవన మిషన్‌కు మండవల్లి ఎంపికైందని, అప్పటినుంచి ఉచితంగా కుళాయిలను ఇచ్చే విషయంలో కొంత జాప్యం ఏర్పడిందని చెప్పారు. ఎన్నికల ముందు ప్రారంభించి ప్రస్తుతం పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనన్నారు వివరాలు తెలుసుకుని ఉచిత కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు ఎంపిక

ప్రజాశక్తి - ముసునూరు

అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం అభినందనీయమని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పి.రవీంద్ర తెలిపారు. ఆయుదాల అను నూజివీడు ట్రిపుల్ ఐటీలో, తల్లిబోయిన కావ్యశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, దాసరి జశ్వంత్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని చెప్పారు. ముగ్గురు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ఏడాది కూడా ఎక్కువ సీట్లు సాధించడానికి కృషి చేస్తామని ఉపాధ్యాయులు కృష్ణవేణి, మల్లేశ్వరి, విరల్ బాబు, కోటేశ్వరమ్మ, మనోహరం, రంగారావు, మోహన్‌రావు, సాకా రవి, బాలు, సౌజన్య తెలిపారు.

ఉంగుటూరు : నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. పొన్నాడ పవన్, గోపిశెట్టి రవితేజ, నక్కా బాల శివసాయి, పాలపర్తి సూర్య దీపిక అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఒకే ఏడాది నలుగురు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రణాళిక బద్దంగా చదువుతూ మంచి మార్కులు వల్లే ఉచితంగా సాంకేతిక విద్యను అభ్యసించే అవకాశం దక్కిందని విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీటు పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.


ముదినేపల్లి : మండలంలోని వడాలి జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థినులు తాజాగా విడుదలైన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వి.ప్రభుదాస్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పి.దీక్షిత, బి.సుష్మ నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను హెచ్ఎం ప్రభుదాస్‌తో, పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చాట్రాయి : మండలంలోని చిన్నంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి, ఉషోదయ ప్రయివేట్ పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ఎంఇఒ వివిఎస్.బ్రహ్మచారి తెలిపారు. చిన్నంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దన్నే మధు, అడ్డగళ్ల భరత ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, జబ్బురి యశ్వంత్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారన్నారు. చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహమ్మద్‌నూర్, ఉషోదయ ప్రయివేట్ పాఠశాల విద్యార్థి దేవరకొండ లోహిత్య ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు.

స్టడీ సర్కిల్ పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గత ప్రభుత్వం ఆపేసిన ఎస్‌సి పథకాల్లో స్టడీ సర్కిల్ పునరుద్ధరించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ కోరారు. ఈ మేరకు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ పేద విద్యార్థులు కోచింగ్ తీసుకోలేక వెనకబడిపోతున్నారు. నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరారు. ప్రతి జిల్లాలో శాశ్వతంగా భవనాలు కట్టాలన్నారు. స్టడీ సర్కిల్ పునరుద్ధరించాలని, హాస్టల్‌తో కూడిన శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునుమల సూర్యచంద్రం, గిరిజన నాయకులు పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న ఫ్రాన్సిస్

ఘనంగా బడేటి బుజ్జి జయంతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గ చరిత్రలో చెదరని ముద్రను వేసుకున్న మాజీ ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి అధికారంలోకి రావడానికి శాయశక్తులా శ్రమించిన కార్యకర్తలకు పదవుల్లో సముచితస్థానం కల్పిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఎ, కీర్తిశేషులు బడేటి బుజ్జి 60వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి విగ్రహానికి ఆయన సోదరుడు, ఎంఎల్‌ఎ బడేటి చంటి, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఎంఎల్‌ఎ చంటి కేక్ కట్ చేశారు.

కందిపప్పు రాయితీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కందిపప్పు రాయితీ కేంద్రాన్ని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుధాన్యాల ధరలు అధికంగా పెరిగిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కందిపప్పు రాయితీ కేంద్రాలను ప్రారంభించిందన్నారు.

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలో చింతలపూడి మర్కంట్స్ ఛాంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, నాణ్యత పాటించాలని ఎంపిపి రాంబాబు అన్నారు. చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న హాస్టల్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం ఏర్పాట్లు, వసతిలో ఉన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. విద్యార్థుల సమస్యలను ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కిరణ్ పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ఆదేశించారు. పెదవేగి మండలం కొక్కిరపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిశీలించిన ఆయన వాటి పరిష్కార దిశగా స్థానిక అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

ఐటిఐ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

లయన్స్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంక్ విజయవాడ వారి సహకారంతో నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో ఐటిఐ విద్యార్థుల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 44 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా సెక్రటరీ శివ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బంగారు ఆభరణాల చోరీపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

బంగారు ఆభరణాల చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.దుర్గామహేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన చాట్రాతి గణేష్ ఈ నెల ఏడో తేదీన హైదరాబాదు వెళ్లి 11 తేదీన ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగుల గొట్టి బీరువాలోని ఆరు కాసుల బంగారపు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. బాధితుడు గణేష్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఆర్ఐ కళాశాలకు అటానమస్ హోదా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాల ఆఫ్ ఫార్మసీకి యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) న్యూఢిల్లీ వారు అటానమస్ హోదా కల్పించిట్లు కళాశాల ఛైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు తెలిపారు. ఈ అటానమస్ హోదా పదేళ్ల పాటు ఆక్టివ్‌లో ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైఎ.చౌదరి చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో వెంకట్రావు కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను అభినందించారు.

కాగిత బ్యాగులనే వినియోగించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో ఢిల్లీ పబ్లిక్ విద్యార్థులు తయారుచేసిన కాగితపు బ్యాగులను స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు సిఐ రాజేష్ శుక్రవారం అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను విని యోగించకుండా దాని స్థానంలో కాగిత, నార బ్యాగులను ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బ తిం టుందన్నారు. కాగిత బ్యాగులను ఉపయోగించి పర్యా వరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

ఎంసి ఛైర్మన్ పదవిని కాపులకు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ పదవిని కాపులకు కేటాయించాలని కోరుతూ కాపు నాయకులు ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు మాట్లాడుతూ ఆశావహులు చాలా మంది ఉన్నప్పటికీ ఎఎంసి ఛైర్మన్ పదవి అన్ని రకాలుగా అర్హత ఉన్న నాయకులు, జనసేన మండల ప్రెసిడెంట్ చిదరాల మధుబాబుకు ఇవ్వాలని కోరారు.

పోలవరంలో డ్రైడే

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో జగన్నాధపేటలో శుక్రవారం ప్రభుత్వ వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నివాసాల వద్ద బయట సీసాలు, కుండీలు, టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాల్లో నీటిని తొలగించారు. సీజనల్ వ్యాధుల పట్ల, సికిల్ సెల్ ఎనీమియా పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు కుసుమకుమారి, అత్తిలి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వెలుగు విఒఎల సమస్యలు పరిష్కరించాలని విఒఎల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సుభాని తెలిపారు. జీలుగుమిల్లిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వెలుగు విఒఎల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా విధుల్లో ఉన్న విఒఎల పట్ల రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో చాలా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా ఇప్పటికీ ఉద్యోగ భద్రత, కాల పరిమితి లేదన్నారు. జీతభత్యాలు పెంచలేదని వాపోయారు. ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వంలో వారికి అనుకూలంగా ఉన్నవారిని పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇది చాలా దుర్మార్గమన్నారు. ఉద్యోగులను తొలగించకుండా ఉద్యోగాలకు రక్షణ కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ కొండలరావు, విఒఎల సంఘం నాయకులు వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, అరుణ రమణ, మంగతాయారు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు


ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీలోని అబ్బుల్లాపురం, అల్లూరి సీతారామరాజునగర్ గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అబ్బుల్లాపురం గ్రామంలో వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేయించాలని, రోడ్లు అభివృద్ధి చేయాలని, ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అబ్బుల్లాపురం - అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య ఎర్రకాలువ వంతెన ఏర్పాటు చేయాలని వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామస్తులు ఎంఎల్‌ఎకు అందించారు. ఎఎస్ఆర్ నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బాలరాజు మాట్లాడుతూ అబ్బుల్లాపురంలో వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేసి రోడ్లపై గోతులు పూడుస్తామని హామీ ఇచ్చారు. ఎఎస్ఆర్ నగర్ మెట్ట వాసులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా తనను కలవవచ్చని తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్య, రోడ్ల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల హామీల అమలుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, నవీన్, తహశీల్దార్ టి.సుభాష్, మండలాభివృద్ధి అధికారి కె.జోగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలి

కంపోస్ట్ యార్డు పనుల పేరుతో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం నగర కార్యదర్శి కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోణంగి కంపోస్ట్ యార్డు పనుల పేరుతో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. పవర్‌పేట సిపిఎం కార్యాలయంలో పార్టీ నగర కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ పోణంగి కంపోస్ట్ యార్డు పనుల పేరుతో అవినీతి జరిగినట్లు పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో వాటిపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిందని విమర్శించారు. మున్సిపల్ వాహనాల ఆయిల్ కుంభకోణం, జనన మరణ పత్రాలకు డబ్బులు వసూళ్లు, ఇంకా ఇతర సెక్షన్లలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. ఈ అవినీతి ఆరోపణలపై గతంలో ఏలూరు కమిషనర్లు బదిలీ అయ్యారన్నారు. ఇప్పుడు తాజాగా వెలుగు చూసిన పోణంగి కంపోస్ట్ యార్డ్‌లో క్వారీ రాళ్ల ముక్కలతో దారులు వేయడం, లెవెలింగ్ చేయడం వంటి పనులు అసలు చేయకుండానే రూ.50 లక్షల వరకు ప్రజాధనం అవినీతి చేసినట్లు పత్రికల్లో స్పష్టంగా వచ్చిందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు వంటి అత్యవసర సమయాల్లో నామినేషన్ విధానంలో కొన్ని పనులకు డబ్బులు ఖర్చు పెట్టవచ్చని, కాని ఆ పేరు చెప్పి అసలు పనులే చేయకుండా రూ.లక్షల డబ్బులు కాజేయటం తీవ్రంగా పరిగణించాలన్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నగర కమిటీ సభ్యులు సాయిబాబు, బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, వివిఎన్.ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

మిగులు భూముల్లో సాగుకు అవకాశం కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సాగు పనులు ప్రారంభం


మిగులు భూముల్లో సాగు కోసం శుభ్రం చేస్తున్న పేదలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎర్ర కాలువ మిగులు భూముల్లో పేదలకు సాగుకు అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షురాలు సీత కోరారు. శుక్రవారం అకాల వర్షం కురవడంతో ప్రాజెక్టు మిగులు భూముల్లో సాగు కోసం శుభ్రం చేస్తూ పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా సతీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నిర్వాసితులకు తాడువాయి ఏరియాలో 1500 ఎకరాల సాగు భూమిని ప్రభుత్వం సేకరించగా వ్యవసాయ భూమి లేకుండా పోయిందన్నారు. వ్యవసాయ కూలీ పని చేసుకుని బతికే పేదలకు ఉపాధి కరువైందన్నారు. దీని పర్యాసానంగా ఎ.పోలవరం, చిన్నవారిగూడెం, తాడువాయి గ్రామాల పేదలకు ఉపాధి లేకపోవడంతో వలస లు వెళ్తున్నారన్నారు. మిగులు భూముల్లో సాగుకు అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందించలేదన్నారు. ఏలూరు ఎంపీ మహేష్, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు మిగులు భూములపై దృష్టి సారించి ఎ.పోలవరం, చిన్నవారిగూడెం, తాడువాయి, వేగవరం, చక్రదేవరపల్లి గ్రామాల పేదలకు పశుపోషణ కోసం సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.చంటి, సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, పేదలు తోనం సోమాలమ్మ, టి.బాలసు రయ్య, బెల్లంకొండ శివయ్య, రెడ్డిబోయిన సత్యవతి, జ్వాలా చినదుర్గయ్య, ఎర్రమాల కుమారి పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - కామవరపుకోట

బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాని జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.బ్యూల అన్నారు. వంద రోజుల స్పెషల్ అవెర్నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా రావికంపాడు, ఆడమిల్లి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన అవగహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మామిడి రైతులను ఆదుకోవాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు కోరారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయిల్‌పామ్, వరి, మామిడి, ఆక్వా రైతుల సమావేశం ఏలూరు ఎంపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'జయప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలి'

అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధుల డిమాండ్

ఏలూరు అర్బన్ : ఎంతో ప్రతిష్టాత్మకమైన రెడ్‌క్రాస్ సంస్థను భ్రష్టు పట్టించి, రూ.కోట్ల సొమ్మును దిగమింగిన రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మన్ మామిళ్లపల్లి జయప్రకాష్, అతనికి సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థలో కరోనా సమయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారాన్ని బహిర్గతం చేయాలని, బహిరంగ విచారణ నిర్వహించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి జాలా బాలాజీ మాట్లాడుతూ నిస్వార్థమైన సేవలందించే రెడ్‌క్రాస్ సంస్థకు అవినీతి మరకలు అంటించిన మాజీ ఛైర్మన్ మామిళ్లపల్లి జయప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.కోట్ల మేర అవినీతి జరిగినా అప్పటి ఉప ముఖ్యమంత్రి అండదండలతో దోపిడీ విషయాన్ని పూర్తిస్థాయిలో వెలుగులోకి రాకుండా చేసి నిజాన్ని దాచేశారన్నారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా సంచలనమైన భారీ స్కామ్‌లో నిందితులుగా ఉన్నవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో తాము లోకాయుక్తాను కూడా ఆశ్రయిస్తామని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లి ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరతామని చెప్పారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జాలా శివశంకర్, నాయకులు బోడా కిరణ్, పెద్దాడ వెంకటరమణ, మాకాల రమేష్, చనపతి వెంకటరమణ, గుంటూరు ప్రకాష్, మెల్లిపాక వెంకన్న పాల్గొన్నారు.

పలువురికి ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్ర డిజిపి ప్రతిష్టాత్మక కమాండేషన్ డేస్ అవార్డులకు ఎంపికైన సిబ్బందిని ఎస్‌పి మేరీప్రశాంతి అభినందించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసిఆర్‌బిలో ఎఎస్ఐగా పనిచేస్తున్న రమేష్‌బాబు, ఏలూరు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న సత్యనారాయణ, ఏలూరు సిసిఎస్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న లక్ష్మణ్, కోర్ట్ మహిళా హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటరమణ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.బాలకృష్ణ కమాండేషన్ డేస్ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ అవార్డులను ఎస్‌పి మేరీప్రశాంతి అందించి వారిని అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని సరిపల్లి అంగనవాడీ కేంద్రాన్ని జనసేన మండల నాయకులు తోటరవి, సర్పంచి తాడేపల్లి గోపీ, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు ఒరింక సత్తిబాబు, టిడిపి నేత మద్దు శ్రీను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న సరుకులను, చిన్నారులకు అందించే పదార్థాలను పరిశీలించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - కలిదిండి

లివింగ్ ఫర్ సొసైటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాకాలనీ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు లివింగ్ ఫర్ సొసైటీ ఛైర్మన్ గుండ్రాల హనుమ అయ్యప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసా ప్రభాకర్, అందుగల లాలు, కంచర్ల సురేష్, జడ్డు సుబ్రహ్మణ్యం, విన్నకోట రామకృష్ణ, వాకాని నరసింహరావు, బి.బాలకృష్ణ, పి.వెంకన్న, సల్మాన్ ఖాన్, అస్లామ్ పాల్గొన్నారు.

వేదాంతపురంలో...

కొయ్యలగూడెం : మండలంలోని వేదాంతపురం ఎంపియుపి స్కూల్ విద్యార్థులకు టిడిపి, జనసేన నాయకుల సమక్షంలో యూనిఫాం, బ్యాగులు, కిట్లు శుక్రవారం అందించారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు అప్పన ప్రసాదరావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

ఎంపీ మహేష్‌కు నాగరాజు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చింతలపూడి

నాయీ బ్రాహ్మణులకు కళ్యాణ మండపానికి ద్వారకాతిరుమలలో 50 సెంట్ల స్థలం కేటాయించినందుకు ఎంపీ పుట్టా మహేష్‌కు జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షులు కొప్పెర్ల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. లింగపాలెం మండలం రంగాపురంలో ఎంపీ మహేష్, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు.

ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు బ్రాంచ్ ఉద్యోగులు ఎంపీ మహేష్‌ను శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సాధారణ బీమా సంస్థలుగా ఉన్న నాలుగింటినీ ఒక కంపెనీగా మార్చాలని కోరుతూ వినతిపత్రం అందించారు. బీమా ప్రీమియంలకు కొత్త ఆస్తి పన్ను విధానంలో ఒక ప్రత్యేక సెక్షన్ కింద మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాన సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని చెప్పారు.

ఎండిపోయిన చెట్ల తొలగింపు

స్పందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కామవరపుకోట

కలెక్టర్‌గా వెట్రిసెల్వి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉప్పలపాడు వద్ద ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని కలెక్టర్ నెంబర్‌కు సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమల్ల మధు వాట్సాప్ ద్వారా సందేశాన్ని పంపించారు. అధికార యంత్రాంగం 24 గంటల్లోనే ఎండిపోయిన చెట్లను తొలగించారు. దీంతో మధు, స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.